క్లుప్తంగా

సీఎం, డిప్యూటీ సీఎం మాట నిలుపుకోవాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రామాంజనేయులు

కూడేరు: ఎన్నికల ముందు భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన మాటను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నిలుపుకోవాలని సీపీఎం అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రామాంజనేయులు డిమాండ్ చేశారు. శనివారం మాట్లాడుతూ అధికారంలో కొస్తే భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని చెప్పిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా దాని ఊసే ఎత్తలేదన్నారు. సంక్షేమ బోర్డును పునరుద్ధరణ చేయాలని కోరుతూ ఈ నెల 25న కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కరీం సాబ్, కార్మికులు రాము, నరసింహులు, రమేష్, పద్మావతి, లక్ష్మీ, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులను పరిరక్షించాలి



మాట్లాడుతున్న బాలల హక్కుల పరిరక్షణ సమితి అధికారి చంద్రకళ

గుమ్మఘట్ట: బాలల హక్కులను పరిరక్షించాలని బాలల హక్కుల పరిరక్షణ సమితి ప్రొటెక్షన్ అధికారి గౌని చంద్రకళ తెలిపారు. శనివారం మండలంలోని గొల్లపల్లి గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలల హక్కులపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ కర్ణాటక సరిహద్దున ఉన్న గ్రామాల్లో బాల్యవివాహాలు జరిగే నష్టాలు, వాటి వల్ల జరిగే అనర్థాలపై ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం అనంతమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ ఫరీదాబాను, అంగన్‌వాడీ వర్కర్స్ మల్లమ్మ, శోభారాణి పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి వసంతోత్సవం



జనార్దన వేంకటేశ్వరస్వామి పల్లకీ ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఉరవకొండ (వజ్రకరూరు): వజ్రకరూరులో వెలసిన జనార్దన వేంకటేశ్వరస్వామి వసంతోత్సవం శనివారం జరిగింది. ఉదయం స్వామికి అభిషేకం, మహా మంగళహారతి, దీక్షా హోమం నిర్వహించారు. అనంతరం భూదేవి, శ్రీదేవి సమేత జనార్దన వేంకటేశ్వరస్వామికి పల్లకీసేవ, వసంతోత్సవం, అమృతోత్సవం నిర్వహించారు.

మాదకద్రవ్యాలతో భవిష్యత్ నాశనం

రాయదుర్గంటౌన్: మాదక ద్రవ్యాలతో యువత జీవితాలు నాశనమవుతాయని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, ఎస్ఐ ప్రసాద్ అన్నారు. శనివారం పట్టణంలోని వినాయక సర్కిల్‌లో డిగ్రీ కళాశాల విద్యార్థులతో కలిసి పోలీసులు, ప్రజా ప్రతినిధులు డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గౌని లావణ్య, పొరాళ్ల గోవిందరాజులు, నజీర్, వార్డు ఇన్‌చార్జ్‌లు గౌని శ్రీరామిరెడ్డి, బషీర్ అహ్మద్, విద్యార్థులు, పోలీసులు పాల్గొన్నారు.

మిర్చి రైతులను ఆదుకోవాలి



గడేకల్లులో తడిసిపోయిన మిర్చిని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

విడపనకల్లు: అకాల వర్షాలతో మిర్చి పంట తడిసిపోయి నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప, ప్రాంతీయ కార్యదర్శి రంగారెడ్డి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బోయ వెంకటేశులు డిమాండ్ చేశారు. మండలంలో గడేకల్లులో అకాల వర్షంతో మిర్చి పంట తడిసిపోయింది. శనివారం మండలంలో గడేకల్లు, ఎన్.తిమ్మాపురం, హంచనహాల్ గ్రామాల్లో సీపీఎం నాయకులు జిల్లా కార్యదర్శి నల్లప్పతో కలిసి స్థానిక నాయకులు పరిశీలించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులను కూడా ఆదుకోవాలన్నారు. అనంతరం ఈదురుగాలులతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, పేదల షెడ్లు కూలిపోయి నష్టపోయిన బాధితులను ఆదుకోవాలని కోరారు.

నేడు ఆత్మీయ నివాళి సభ

రాయదుర్గంటౌన్: స్థానిక ప్రజాపిత బ్రహ్మ కుమారీల ఈశ్వరీయ విశ్వ విద్యాలయం (ఓంశాంతి)లో ఆదివారం ఉదయం 11 గంటలకు బ్రహ్మకుమారీల 5వ గ్లోబల్ అడ్మినిస్ట్రేటివ్ హెడ్ దాది రతన మోహిని(101)కి ఆత్మీయ నివాళి సభ నిర్వహిస్తున్నట్లు సంచాలకురాలు బీకే యోగీశ్వరి ఓ ప్రకటనలో తెలిపారు.

అపార నష్టం..పరిహారం శూన్యం

- అకాల వర్షాలు, వడగళ్లతో నష్టపోయిన రైతులు
- నివేదికలు సమర్పించామంటున్న అధికారులు
- అయోమయంలో అన్నదాతలు
- వైఎస్సార్‌సీపీ హయాంలో పరిహారమే పరిహారం విడుదల



బొమ్మనహాళ్ వద్ద నేలకూలిన మొక్కజొన్న పంట (ఫైల్)



దెబ్బతిన్న పత్తి పంట (ఫైల్)

రాయదుర్గం: రైతు సంక్షేమమే ధ్యేయమని గొప్పలు చెప్పుకునే కూటమి సర్కారు.. అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో నిర్లక్ష్యం చూపుతోంది. కోటి ఆశలతో సాగుచేసిన రబీ పంటలు ప్రకృతి ప్రకోపానికి తుడిచిపెట్టుకుపోతే కేవలం అధికారులు నివేదికలతో చేతులు దులుపుకున్నారు. ప్రజా ప్రతినిధులు కనీసం పరామర్శించిన దాఖలాలు లేవని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాయదుర్గం నియోజకవర్గంలో ఈ నెల 11న కురిసిన భారీ వర్షం, గాలీవాన బీభత్సవానికి రాయదుర్గం, కణేకల్లు, బొమ్మనహాళ్, డి హీరేహాళ్, గుమ్మఘట్టతో పాటు కళ్యాణదుర్గం, గార్లదిన్న మండలాల్లో వరి 744 హెక్టార్లలో దారుణంగా దెబ్బతినింది. దీంతో 488 మంది రైతులకు రూ.4.99 కోట్లు నష్టపోయారు. 171 హెక్టార్లలో పత్తి పంట దెబ్బతినింది. 102 మంది రైతులు రూ.75 లక్షలు కోల్పోవాల్సి వచ్చింది. 745 హెక్టార్లలో మొక్కజొన్న పంట ధ్వంసమైంది. దీంతో 743 మంది రైతులు రూ.4.88 కోట్లు నష్టపోయినట్లు అధికారులు లెక్కలు తేల్చారు. మొత్తంగా 1,660 హెక్టార్లలో 1,333 మంది రైతులు రూ.12.07 కోట్లు నష్టపోయారు. ఈ నష్టాన్ని ఉన్నతాధికారులకు నివేదికలు సమర్పించారు. దీనికితోడు మామిడి, సపోట, బొప్పాయి, దానిమ్మ పంటలు సుమారు వంద హెక్టార్లకు పైగా దెబ్బతిన్నాయి. చేతికొచ్చిన మామిడి నేలరాలిపోయి తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది.

ప్రతి రైతునూ ఆదుకోవాలి



వడగండ్ల వానతో నష్టపోయిన వరి, పత్తి, మొక్కజొన్న అరటి, బొప్పాయి, సపోట, దానిమ్మ రైతులను కూటమి సర్కారు ఆదుకోవాలి. జిల్లాలో ఇతర ప్రాంతాలతో పోలిస్తే రాయదుర్గం నియోజకవర్గంలోనే అత్యధికంగా రైతులు నష్టపోయారు. పంట పొలాలు పరిశీలనకు వెళ్లిన సమయంలో రైతుల కళ్లల్లో కన్నీళ్లు చూసి బాధేస్తోంది. కూటమి సర్కార్ బాధిత రైతులను ఆదుకోలేకపోతోంది. ఎకరాకు రూ.50 వేలు పరిహారం ఇవ్వాలి. త్వరలో సహాయం ప్రకటించాలి.

– మెట్టు గోవిందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, రాయదుర్గం

14 ఎకరాల్లో నష్టపోయా



నేను 14 ఎకరాల్లో వరి పంట సాగు చేశా. ఎకరానికి రూ.35 వేల వరకు పెట్టుబడి పెట్టా. పంట చేతికందే సమయంలో వడగండ్ల వానకు నేలమట్టమైంది. గింజలన్నీ రాలిపోయాయి. రూ.5 లక్షల వరకు నష్టపోయాం. ప్రభుత్వ సహాయం కోసం ఎదురుచూస్తున్నాం.

– కురుబ రాజేశ్వరప్ప, గోనేహాళ్ గ్రామం, బొమ్మనహాళ్ మండలం

పంట నష్టం.. వెంటనే పరిహారం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఎప్పటికప్పుడు పరిహారం చెల్లిస్తూ బాధిత రైతులకు అండగా నిలిచింది. ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన తక్షణమే అధికారులు రంగంలోకి దిగి పరిహారానికి ప్రతిపాదనలు పంపేవారు. అవసరమైన చోట తక్షణ సహాయం ప్రకటిస్తూ బాధిత రైతులకు బాసటగా నిలిచారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా ఏపీలో మాత్రమే మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కొత్త సంప్రదాయాన్ని అమలులోకి తీసుకొచ్చారు. విత్తు నుంచి విపత్తు దాకా రైతుకు అండగా నిలిచారు. ప్రస్తుత కూటమి సర్కార్ ఆదిశగా ఆదుకునే చర్యలు చేపట్టడం లేదంటూ అన్నదాతలు నిట్టూరుస్తున్నారు.

మల్లేశ్వరస్వామి సన్నిధిలో జడ్జి



మల్లేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న జిల్లా ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి సాదుబాబు

కళ్యాణదుర్గం: కంబదూరు మండలంలో ప్రసిద్ధిగాంచిన కమల మల్లేశ్వరస్వామి ఆలయాన్ని జిల్లా ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి సాదుబాబు దర్శించుకున్నారు. శనివారం ఉదయం కళ్యాణదుర్గంలోని అక్కమాంబ ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం కంబదూరుకు వెళ్లారు. ఈ సందర్భంగా ఎండోమెంట్ ఈఓ దేవదాస్ తదితరులు జడ్జికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయా ఆలయాల ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం అర్చకులు జడ్జికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో కంబదూరు తహసీల్దార్ బాలకిషన్, కళ్యాణదుర్గం సర్కిల్ సీఐ నీలకంఠేశ్వర్, ఎస్ఐలు ప్రవీణ్, రాంభూపాల్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

సొల్లాపురంలో తాగునీటి కష్టాలు



నీటి ట్యాంకు వద్ద కుస్తీ పడుతున్న జనం

కణేకల్లు: సొల్లాపురం గ్రామంలో తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కార్మికులు వేతనాల కోసం సమ్మె బాట పట్టడంతో నీటి సరఫరా ఆగిపోయింది. అప్పటి నుంచి గ్రామానికి తాగునీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. పంచాయతీ సర్పంచు మహేశ్వరి ప్రజల దాహార్తి తీర్చేందుకు రోజూ ట్యాంకర్లు ఏర్పాటు చేస్తున్నారు. గ్రామంలో ఈనెల 28 నుంచి 30 వరకు నూతనంగా నిర్మించిన సీతారామాలయం ప్రారంభోత్సవ కార్యక్రమం ఉంది. ఈ వేడుకలకు ప్రజలు బంధువులు, స్నేహితులను ఆహ్వానించారు. వచ్చే వారంలో మూడు రోజుల పాటు ఊరంతా పండుగ వాతావరణం ఉంటుందని, తాగునీరు, ఇతర అవసరాలకు నీరు లేకపోతే ఇబ్బంది పడాల్సి వస్తుందని గ్రామస్తులు నీటి కోసం అవస్థలు పడుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి శ్రీరామరెడ్డి తాగునీటి పథకం వర్కర్ల సమస్యను పరిష్కరించి, నీటి సరఫరా పునుద్ధరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

కృష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మృతి

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం హీరో కృష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తలారి శ్రీరాములు (50) అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. అసోసియేషన్ సభ్యులు గ్యాస్ తిప్పేస్వామి, ఎర్ర నాగరాజు,నాగప్ప, పూజారి ఈశ్వరప్ప తదితరులు శ్రీరాములు మృత దేహానికి నివాళులర్పించారు.

వృత్తి పన్ను బకాయిలు చెల్లించాలి

- డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ సంజీవరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ సంజీవరెడ్డి

ఉరవకొండ: వ్యాపారులు వృత్తి పన్ను (ప్రొఫెషనల్ ట్యాక్స్)బకాయిలు చెల్లించి సహకరించాలని జీఎస్టీ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ సంజీవరెడ్డి తెలిపారు. శనివారం స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మంటపంలో ప్రముఖ వ్యాపారవేత్త, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బుశెట్టిరమేష్‌బాబు ఆధ్వర్యంలో జీఎస్టీపై వ్యాపారులకు అవగాహన కల్పించారు. సమావేశాన్ని ఉద్దేశించి అసిస్టెంట్ కమిషనర్ మాట్లాడుతూ వృత్తి పన్ను బకాయి 2017 నుంచి ప్రస్తుతం 2025 వరకు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఏడాదికి రూ.10 లక్షల వరకు టర్నోవర్ చేసే వారికి జీఎస్టీ నుంచి మినహాయింపు ఉంటుందన్నారు. రూ.10 లక్షల పై నుంచి రూ.50 లక్షల వరకు టర్నోవర్ చేసే వ్యాపారులు రూ.1,250 చెల్లించాల్సి ఉంటుందని, రూ.50 లక్షల నుంచి ఆపై వ్యాపారం చేసే వారు రూ. 2,500 చెల్లించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో స్పెషల్ ఎస్‌టీఓ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్రలో భాగస్వాములు కావాలి



ఎలక్ట్రానిక్స్ వేస్టేజ్ అండ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా పరికరాలను చూపుతున్న అధ్యాపకులు, విద్యార్థులు



రాయదుర్గం:ఈ-వ్యర్థాలను సేకరిస్తున్న మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప

కళ్యాణదుర్గం: స్వర్ణాంధ్ర...స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాల్లో విద్యార్థులు, ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఎస్వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ శేషయ్య అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ వేస్టేజ్ అండ్ మేనేజ్‌మెంట్ కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ సిబ్బందితో కలిసి స్వర్ణాంధ్ర...స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రధాన వీధుల్లోని చెత్తా చెదారాన్ని శుభ్రం చేయించారు. కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు పి.సూర్య నాగిరెడ్డి, ఇతర అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాయదుర్గంటౌన్: పట్టణంలో స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ఈ-వ్యర్థాలపై శనివారం అవగాహన ర్యాలీ చేశారు. పట్టణంలోని బొడ్రాయి వద్ద నుంచి మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, కమిషనర్ దివాకర్‌రెడ్డి, కౌన్సిలర్ల ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. అనంతరం వినాయక సర్కిల్‌లో ప్రతిజ్ఞ చేశారు. కౌన్సిలర్లు గౌని లావణ్య, శారదాదేవి, ప్రశాంతి, జ్యోతి, పొరాళ్ల గోవిందరాజులు, శివపుత్ర, కోఆప్షన్ సభ్యుడు నజీర్, వార్డు ఇన్‌చార్జ్‌లు పొరాళ్ల శివకుమార్, గౌని శ్రీరామిరెడ్డి, నిజాముద్దీన్, దివాకర్, బషీర్ అహ్మద్, మున్సిపల్ ఏఈ నరసింహులు, మెప్మా టీపీఓ సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని తహసీల్దార్ మునివేలు, ఎంపీడీఓ విజయభాస్కర్ అన్నారు. శనివారం బొమ్మనహాళ్, నేమకల్లు, శ్రీధరఘట్ట గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఎం రామకృష్ణ, ఈఓపీఆర్డీ దాస్, సర్పంచ్ పరమేశ్వర పాల్గొన్నారు.

కూడేరు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యంగా ఉండొచ్చని ఎంపీడీఓ కుళ్లాయి స్వామి సూచించారు. శనివారం స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా కూడేరులో మండల అధికారులు హైస్కూల్ విద్యార్థులతో కలిసి పరిశుభ్రతపై ర్యాలీ నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించారు. సర్పంచ్ లలితమ్మ, ఈఓఆర్డీ రాధాకృష్ణ, పంచాయతీ కార్యదర్శి రమాదేవి విద్యార్థులు పాల్గొన్నారు.



కూడేరులో మానవహారం నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థినులు

శెట్టూరు: పరిసరాల శుభ్రతతో ఆరోగ్యంగా ఉండొచ్చని డిప్యూటీ డీఈఓ శ్రీనివాస్‌రావు అన్నారు. శనివారం మండల కేంద్రంలో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో కలిసి మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ చేశారు. పోలీస్ స్టేషన్, సచివాలయం, రెవెన్యూ కార్యాలయాల్లో సిబ్బంది పరిసరాలను శుభ్రం చేశారు. పంచాయతీరాజ్ డీఈ చంద్రశేఖర్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘురామరావు, జేఈ సురేంద్ర ప్రసాద్, గ్రంథాలయ అధికారి రజిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బెళుగుప్ప: గంగవరంలో పోషణ పక్వాడా కార్యక్రమాలపై ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీదేవి ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ చేశారు. సీడీపీఓ మాట్లాడుతూ ఈనెల 8 నుంచి 22 వరకు పోషణ పక్వాడా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఏసీడీపీఓ ఎల్లమ్మ, సూపర్‌వైజర్ అరుణ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



కొనకొండ్ల సీహెచ్‌సీ వద్ద డెమో నిర్వహిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

రాయదుర్గంటౌన్: అగ్నిప్రమాదాల నివారణలో అందరూ బాధ్యతగా వ్యవహరించాలని, అప్పుడే అగ్నిప్రమాద రహిత సమాజాన్ని ఏర్పాటు చేయొచ్చని ఫైర్ ఆఫీసర్ నాగేశ్వరరావు తెలిపారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ప్రమాదాలపై అవగాహన కార్యక్రమంతో పాటు ప్రమాదాలు జరిగినప్పుడు ఏవిధంగా రక్షించుకోవాలనే విషయాలపై ఫైర్ మాక్‌డ్రిల్ చేసి చూపించారు. అనంతరం రోగులు, ప్రజలు, సిబ్బందికి అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ మెర్సీజ్ఞానసుధ, వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై సిబ్బంది డెమో

ఉరవకొండ (వజ్రకరూరు): ప్రభుత్వాస్పత్రుల్లో జరిగే అగ్ని ప్రమాదాలపై గుంతకల్లు అగ్నిమాపక శాఖ సిబ్బంది చేసిన డెమో ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంది. శనివారం వజ్రకరూరు మండలం కొనకొండ్ల సీహెచ్‌సీలో అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. జిల్లా అసిస్టెంట్ అగ్నిమాపక శాఖ అధికారి అశ్వర్థ ఆధ్వర్యంలో సిబ్బంది ఆసుపత్రిపై అంతస్తులో అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు వైద్య సిబ్బంది ఎలా వ్యవహరించాలో రోగులను ఎలా కాపాడుకోవాలో డెమో చేసి చూపారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు



ఉరవకొండలో ఈస్టర్ సందేశాన్ని ఇస్తున్న పాస్టర్ ప్రమీలా జోసెఫ్



మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించిన క్రిస్టియన్ అసోసియేషన్ సభ్యులు



బెళుగుప్పలో రన్ ఫర్ జీసస్ నిర్వహిస్తున్న దృశ్యం

ఉరవకొండ: మండల వ్యాప్తంగా అన్ని చర్చిల్లో క్రైస్తవులు ఈస్టర్ వేడుకలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉరవకొండ సీఎస్ఐ చర్చిలో పాస్టర్ ప్రమీలా జోసెఫ్ ఆధ్వర్యంలో ఈస్టర్ సందేశామిచ్చారు. ఉరవకొండ క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉరవకొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రక్తదాన శిబిరాన్ని ఎంపీడీఓ రవిప్రసాద్, విడపనకల్లు ఎంపీడీఓ భాస్కర్, ఈఓ గౌస్‌సాహెబ్, మాజీ ఎంపీపీ ఏసీ ఎర్రిస్వామి తదితరుల చేతుల మీదుగా ప్రారంభించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ పవిత్ర ఈస్టర్ సందర్భంగా మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం ఎంతో గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఆనంద్, ఉపాధ్యక్షురాలు ప్రమీలమ్మ, బెన్సన్, కార్యదర్శి జాషువా, కోశాధికారి పాస్టర్ సురేష్, సహాయ కార్యదర్శి విక్రమ్, గౌరవ అధ్యక్షులు ఆరోగ్యనాథ్, భాస్కర్, లేపాక్షి, రాము, ఇస్సాక్, శాంతరాజ్, డెవిడ్, షాహిన్‌లు పాల్గొన్నారు.

బెళుగుప్ప: మండల కేంద్రంలోని ప్రధాన వీధుల్లో శనివారం మండల పాస్టర్స్ ఘనంగా రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధాన రహదారుల్లో రన్ ఫర్ జీసస్ జెండాలతో వెలుతూ జీసస్ త్యాగాన్ని వివరించారు. యేసు క్రీస్తు మానవాళి రక్షణ కొరకే నిలిచారన్నారు. ప్రతి ఒక్కరూ సంతోషంగా ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సంతోష్, పాస్టర్ రాజు, జాన్‌పాల్, జక్కయ్య, ప్రేమ్‌కుమార్, దావీద్, ఆనందఖ, ఒదయ్య, ఇస్సా పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

బాధితుడికి ఆర్థిక సాయం

కళ్యాణదుర్గం రూరల్: నారాయణపురానికి చెందిన హనుమంతురాయుడు, జయమ్మ దంపతుల కుమారుడు ఆదికుమార్ చికిత్స కోసం ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బద్దేనాయక్ శనివారం ఆర్థిక సాయం అందించారు.

21, 22 తేదీల్లో విద్యుత్ అంతరాయం

ఉరవకొండ: ఉరవకొండ విద్యుత్‌శాఖ సబ్ డివిజన్ పరిధిలోని ఉరవకొండ, విడపనకల్లు, కణేకల్లులో ఈనెల 21, 22వతేదీల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ భాస్కర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వజ్రకరూరు మండల పరిధిలోని 132 కేవీ లైన్ టవర్ల నిర్మాణం జరుగుతున్న దృష్ట్యా త్రీఫేస్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు.

వడ్డీతోనే రెన్యూవల్ చేయాలి

డి హీరేహాళ్ (రాయదుర్గం): పంటల సాగుకోసం తీసుకున్న వ్యవసాయం, బంగారం రుణాలన్నీ కేవలం వడ్డీతో రెన్యూవల్ చేసుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు మల్లికార్జున ఆయా బ్యాంకు మేనేజర్లకు విజ్ఞప్తి చేశారు. శనివారం డీ హీరేహాళ్ మండలంలోని ఐదు బ్యాంకుల్లోని మేనేజర్లను రైతులతో కలసి వినతిపత్రాలు సమర్పించారు.

విద్యార్థుల భవిష్యత్తు నాశనం చేసిన ప్రభుత్వం

కళ్యాణదుర్గం రూరల్: కూటమి ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తు నాశనం చేసిందని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు హనుమంతరాయుడు మండిపడ్డారు. శనివారం పట్టణంలోని ఎస్వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర స్థాయి విద్య వైజ్ఞానిక రాజకీయ శిక్షణ తరగతులు ఈనెల 26,27,28వ తేదీల్లో కడప నగరంలో జరిగే కార్యక్రమ కరపత్రాలు విడుదల చేశారు. ఏఐఎస్ఎఫ్ గర్ల్స్ కన్వీనర్ మౌలిక, కో కన్వీనర్లు స్రవంతి, శ్రీలేక, అరుణ, నాయకులు పవన్, సింహాద్రి, విద్యార్థులు పాల్గొన్నారు.

జింకల సమస్య పరిష్కారానికి చర్యలు

విడపనకల్లు: మండలంలోని పెద్ద కొట్టాలపల్లి వ్యవసాయ పొలాల్లో జింకల బెడద ఎక్కువగా ఉందని గ్రామస్తులు వ్యవసాయ శాఖాధికారులతో రైతులు శనివారం వాపోయారు. శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకునే విధంగా అటవీశాఖాధికారులకు రిపోర్టు పంపుతామని ఏఓ పెన్నయ్య రైతులకు భరోసా ఇచ్చారు. ఏఈఓ రాఘవేంద్ర, ఎంపీఈఓ శివలత, మాజీ సర్పంచు రంగనాయులు, రైతులు గొర్తి శ్రీరాములుపాల్గొన్నారు.

పొలాల కంచెకు విద్యుత్ వదిలితే చర్యలు

కుందుర్పి: రైతులు పంట పొలాల చుట్టూ కంచెకు విద్యుత్ వదిలితే చర్యలు తప్పవని జంబుగుంపల అటవీ బీట్ అధికారి పరమేశ్వరప్ప హెచ్చరించారు. శనివారం ఆయన జంబుగుంపల, బెస్తరపల్లి, కొలిమిపాళ్యలో పర్యటించారు. అడవి పందులు, ఎలుగుబంట్లు, చిరుతలు సైతం విద్యుత్ షాక్‌తో మృతి చెంతున్నట్లు తెలిసిందన్నారు.

ఉద్యాన పంటల పరిశీలన

కుందుర్పి: నకిలీ విత్తనాలు, తెగుళ్లతో దెబ్బతిన్న పండ్ల తోటలను కంబదూరు హార్టికల్చర్ అధికారి గౌషియా శనివారం పరిశీలించారు. కుందుర్పికి చెందిన రైతు నరసింహులు కళ్యాణదుర్గంలోని మందుల దుకాణంలో కర్బూజా నాసిరకం విత్తనాలు ఇవ్వడంతో పంట దెబ్బతినింది. బాధితుడి ఫిర్యాదు మేరకు ఏఓ మహేష్, హెచ్ఓ గౌసియా వేర్వేరుగా పంటను పరిశీలించారు. ఎంపీఈఓ అంజినమ్మ పాల్గొన్నారు.

ఉపాధి బిల్లులు సత్వరం చెల్లించాలి

కుందుర్పి: మండల వ్యాప్తంగా 3 నెలలుగా పెండింగులో ఉన్న ఉపాధి బిల్లులను సత్వరం చెల్లించాలని ఎంపీపీ కమలమ్మ, జెడ్పీటీసీ రాధాస్వామి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ హనుమంతరాయుడు, తాలూకా మహిళా అధ్యక్షురాలు నాగమణి, సర్పంచ్‌లు గంగాధర్, అతావుల్లా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. బిల్లులు ఇవ్వక పోతే ఎంపీడీఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో ఆదాయం

బెళుగుప్ప: ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో స్థిరమైన ఆదాయం పొందొచ్చని ఏఓ పృథ్వీసాగర్, ఏపీఎం సురేఖ తెలిపారు. శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ టీమ్ లీడర్ నాగరాజు, మహిళా సమాఖ్య సభ్యులు, వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అఖిల, పవిత్ర, నందిని, కమ్యూనిటీ న్యాచురల్ ఫార్మింగ్ సిబ్బంది కాసీం, మారెన్న, యశ్వంత్ పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగినిపై చర్యలు తీసుకోవాలని నిరసన

కళ్యాణదుర్గం: ఇందిరమ్మ కాలనీలోని వార్డు సచివాలయ ఉద్యోగి అనితపై చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ చాంబర్‌లో నేలపై కూర్చొని నిరసన తెలియజేశారు. ఇందిరమ్మ కాలనీలోని వార్డులో పనిచేస్తున్న సచివాలయ ఉద్యోగి అవినీతికి పాల్పడుతోందంటూ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. కాలనీలో తన ఇంటి ముందు కొళాయి ఏర్పాటు చేసుకునేందుకు రూ.10 వేలు డబ్బులు ఇవ్వాలని, లేదంటే తొలగిస్తామని సచివాలయ ఉద్యోగి అడిగిందని ఎమ్మార్పీఎస్ నాయకుడు ఓబులేసు తెలిపాడు. ఇందిరమ్మ కాలనీవాసులు నిరసన తెలియజేయడాన్ని గ్రహించిన ఉద్యోగిని.. పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న ప్రజా సంఘాలనాయకులు సీపీఐ నాయకుడు గోపాల్, గిరిజన సంఘం నాయకుడు తిప్పేస్వామి నాయక్, ఎంఆర్‌పీఎస్ నాయకులు ఆర్‌కే రాజు, సాకే గురు మూర్తి, గోవిందప్ప, చెలిమప్ప తదితరులు అనితపై చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను నిలదీశారు. చర్యలు తీసుకోని పక్షంలో ఉద్యమం చేస్తామని వారు హెచ్చరించారు.

పరిమితికి మించి తరలిస్తే చర్యలు

కళ్యాణదుర్గం: పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే చర్యలు తప్పవని పట్టణ సీఐ యువరాజు హెచ్చరించారు. శనివారం ఉదయం వాహనాల తనిఖీల్లో భాగంగా శెట్టూరు నుంచి కళ్యాణదుర్గం వైపు 40 మంది ప్రయాణికులతో వస్తున్న బొలెరో వాహనాన్ని సీఐ అడ్డుకున్నారు. వాహనంలో వస్తున్న వారి సంఖ్యను గుర్తించి కూలీల వివరాలపై ఆరా తీశారు. పరిమితిని మించి బొలెరో వాహనంలో రాకూడదని ఆటోలలో వెళ్లాలని కూలీలను అక్కడి నుంచి పంపించివేశారు. అనంతరం బొలెరో వాహన డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు.

అకాల వర్షంతో పంట నష్టం



కలుగోడులో వడగండ్ల వర్షానికి దెబ్బతిన్న పత్తి పంట

గుమ్మఘట్ట:కలుగోడు, మారెంపల్లి, భూపసముద్రం, రంగసముద్ర, గొల్లపల్లి గ్రామాల్లో శుక్రవారం రాత్రి కురిసిన వడగండ్ల వానతో 60 ఎకరాల్లో పత్తి,మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నట్లు ఏఓ నిర్మల్‌కుమార్ తెలిపారు. పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతుల జాబితాను ప్రభుత్వానికి పంపుతామని ఆయన తెలిపారు. కరువు జిల్లాలో అన్నదాతలు సాగుచేసి నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

భూ సమస్య పరిష్కరించండి

కళ్యాణదుర్గం రూరల్: దళిత గిరిజన భూ సమస్యలను పరిష్కరించాలని ఆర్‌డీఓ కార్యాలయ ఏవో ఈశ్వరమ్మకు బాధిత రైతులు, జేఏసీ నాయకులు శనివారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్సీ,ఎస్టీ జేఏసీ తాలూకా అధ్యక్షుడు చెలిమప్ప, మల్లేష్, మధు, వన్నూరక్క పాల్గొన్నారు.